నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 6 ఆగస్టు 2024 | NALGONDA

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

రామగిరి, ఆగస్టు 5 : డీఎస్సీ 2024 పరీక్షలు సోమవారం ముగిశాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాల అవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో గతనెల 18 నుంచి ఈనెల 5 వరకు వివిధ సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలు జరిగాయి. పరీక్షలను డీఈఓ భిక్షపతి, సెక్టోరియల్ అధికారి రామచంద్రయ్య పర్యవేక్షించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 5 : 2024-25 విద్యాసంవత్సరం ఓపెన్ పది, ఇంటర్ తరగతుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి అక్టోబర్ 10 వరకు దరఖాస్తు ఫారాలు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. నిర్ణీత రుసుంతో సెప్టెంబర్ 30లోగా ఆలస్య రుసుముతో అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జగదీశ్‌కుమార్‌ను 8008403523 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గలగలా కృష్ణమ్మ

- మొదట రెండు గేట్లు.. క్రమంగా 20 గేట్లు ఎత్తిన అధికారులు
- సాగర్ అందాలు చూసేందుకు పర్యాటకుల రాక

సాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 5 : తెలుగు రాష్ట్రాల వర ప్రదాయిని అయిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తడంతో డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని స్పిల్‌వే మీదుగా దిగువన ఉన్న కృష్ణా డెల్టాకు సోమవారం విడుదల చేశారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గానూ 584 (296.55 టీఎంసీలు) అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 3,61,455 క్యూసెక్కుల నీరు వచ్చి సాగర్‌కు చేరుతుండడంతో కలెక్టర్ నారాయణరెడ్డి, ఇరిగేషన్ ఇన్‌చార్జి సీఈ నాగేశ్వర్‌రావు, ఎన్నెస్పీ ఈఈ మల్లికార్జునరావుతో కలిసి నీటి విడుదలను ప్రారంభించారు. డ్యామ్‌పై పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు చీరలతో వాయినం సమర్పించారు. ఉదయం 10.55 గంటలకు 13, 12వ క్రస్ట్ గేట్లను బటన్ నొక్కి నీటి విడుదలను ప్రారంభించారు. ఆ తర్వాత వరద ఉధృతిని తగ్గించడానికి గేట్లను ఎత్తుతూ క్రమంగా రాత్రి 10 గంటల వరకు 20 గేట్లు ఎత్తి 1,96,027 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద ఆధారంగా క్రస్ట్ గేట్ల సంఖ్యను పెంచడం, తగ్గించడం జరుగుతుందని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌కు 1,63, 220 క్యూసెక్కుల అవుట్ ఫ్లో, 3,23,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది.

సోమవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో 16 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

కృష్ణమ్మకు పూజలు చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఇరిగేషన్ ఇన్‌చార్జి సీఈ నాగేశ్వర్‌రావు

సాగర్ డ్యామ్ ఎదుట సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

రెండు పంటలకు నీరు అందిస్తాం : కలెక్టర్ నారాయణ రెడ్డి

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ద్వారా ఈ సంవత్సరం రెండు పంటలకు సాగు నీరు అందిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఎడమ కాల్వ ద్వారా తాగు, సాగు నీటికి నీటి విడుదల కొనసాగుతుందని, నదిలో పూర్తి స్థాయిలో నీటి సామర్థ్యం ఉన్నందున ఈ ఏడాది పంటలకు నీటి కొరత లేదని చెప్పారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతంలో రైతులు, జాలర్లు, పశువుల కాపర్లు నదీ సమీపంలోకి వెళ్లరాదని సూచించారు.

పర్యాలకుల సందడి

డ్యామ్ క్రస్ట్ గేట్లను ఎత్తడంతో కృష్ణమ్మ అందాలను వీక్షించడానికి పర్యాటకులు తరలివచ్చారు. క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న జలాలను వీక్షిస్తూ ఫొటోలు, సెల్ఫీలు దిగారు. డ్యామ్ పిల్లర్, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, కొత్త బ్రిడ్జి, శివాలయం పుష్కర ఘాట్ సమీపంలో పర్యాటకులతో సందడి నెలకొన్నది. ఇక పోలీసు, రెవెన్యూ అధికారులు నాగార్జునసాగర్ డ్యామ్ పరిసరాలలో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కొత్త బ్రిడ్జి, పవర్ హౌస్ వచ్చే దారిలో బారికేడ్లు ఏర్పాట్లు చేశారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో మొక్కలను అందజేస్తున్న మండలి చైర్మన్ గుత్తా, చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం, కలెక్టర్ నారాయణరెడ్డి

పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు పెంచాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, ఆగస్టు 5 : పర్యావరణ పరిరక్షణ మన చేతుల్లోనే ఉందని, మొక్కలు పెంచితే పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం చిట్యాలలో ఆయన ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు, యువత విరివిగా మొక్కలు నాటడంతోపాటు ఇతరులతో నాటించాలని తెలిపారు. ఒక్క పచ్చదనంతోనే సరిపోదని, మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంతో అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పరిశుభ్రతతోపాటు మొక్కలు నాటడం, నీటి సంరక్షణ తదితర అంశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో అన్ని వర్గాల సిబ్బంది పాల్గొనాలని, కార్యదర్శులు ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ విరివిగా మొక్కలు నాటినప్పుడే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు. ప్రభుత్వం అందజేసే ఆరు మొక్కలను ఇంటి పరిసరాలలో నాటి సంరక్షించుకోవాలని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్నవెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మున్సిపల్ కమిషనర్ పి.వీరేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తాం

- రవాణాకు ఇబ్బంది లేకుండా బ్రిడ్జిల నిర్మాణం
- విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి/కోదాడ రూరల్, ఆగస్టు 5 : వ్యవసాయ రంగానికి ఇబ్బంది లేకుండా 24 గంటల కరెంట్ ఇస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బక్కమంతులగూడెంలో రూ.2.50 లక్షలతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆయన తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఈ విద్యుత్ ఉపకేంద్రంతో దశాబ్ద కాలంగా కోరుతున్న రైతుల కల నెరవేరుతుందన్నారు. సుల్తాన్‌పురం తండా వద్ద ఎన్‌సీఎల్, చెన్నాయిపాలెం సబ్‌స్టేషన్‌ల పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. రూ.80కోట్లతో హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు, రూ.10కోట్లతో చౌటపల్లి నుంచి మేళ్లచెర్వు వరకు, రూ.17 కోట్లతో మఠంపల్లి నుంచి జాన్‌పహాడ్ రోడ్డు మార్గంలో, వర్డాపురం, రాఘవాపురం వద్ద రెండు బ్రిడ్జిలు, రూ.11.5కోట్లతో చెన్నాయిపాలెం వద్ద బ్రిడ్జి నిర్మిస్తామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అమరవరం, పెదవీడు లిఫ్ట్ ఇరిగేషన్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం బక్కమంతులగూడెంలో స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాన్ని మంత్రి ఉత్తమ్ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు సూర్యానారాయణరావు, శ్రీనివాస్, జడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సీహెచ్ పాల్‌రాజ్, డీఈలు వెంకట కృష్ణయ్య, డాలినాయుడు, ఈఈ కృష్ణారెడ్డి, తాసీల్దార్లు సాయిగౌడ్, మంగరాథోడ్, మఠంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, నాయకులు గంగసాని ఎల్లారెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, రామిశెట్టి అప్పారావు, బచ్చలకూరి బాబు, బోగాల వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఆదూరి కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రైతు ప్రయోజనాల కోసం చెరువులు నింపాలి

- బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేయాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, ఆగస్టు 5 : కృష్ణా పరీవాహక ప్రాంతంలో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులన్నీ నిండి నీరు వృథాగా వెళ్తున్నందున జిల్లాలోని చెరువులన్నీ నింపాలని, రైతులకు ఇబ్బంది కలుగకుండా సాగు నీరు విడుదల చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు. నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో సరైన వర్షాలు లేక రైతులు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో నాలుగు వేల చెరువులు ఉన్నాయని, నకిరేకల్ నియోజకవర్గంలో 350 చెరువులు ఉన్నాయని, ముందస్తుగా చెరువులకు మరమ్మతులు చేసి ప్రాజెక్టుల ద్వారా నీటిని నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అధిక నిధులు తీసుకొచ్చి ట్రయల్ రన్ సక్సెస్ చేశామని, ఆ తర్వాతే మండలంలోని అన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. తమ హయాంలో భూ సేకరణ ఎంతో జరిగిందని, కొద్దిపాటి భూ సేకరణ పూర్తి చేసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు. అలాగే అయిటిపాముల ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల తోపాటు ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వ పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి రెండు సార్లు పంటల పెట్టుబడికి రైతు బంధు ఇవ్వగా, కాంగ్రెస్ పాలనలో రైతుబంధు లేదని, రుణమాఫీ అంటూ ఆర్భాటానికే పరిమితమయ్యిందని ఎద్దేవా చేశారు. లక్ష రూపాయలు రుణం ఉన్న రైతుల్లో 30 శాతమే మాఫీ అయ్యిందని తెలిపారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి సన్నాలకే ఇవ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. నిత్యం అబద్ధాలు చెబుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, నాయకులు యానాల అశోక్ రెడ్డి, దుబ్బాక శ్రీధర్, మల్గ బాలకృష్ణ, కొండూరి శంకర్, నడిపల్లి నరేశ్, పుల్లెంల వెంకట్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

డాయ్ యాప్ దగా!

- పెట్టుబడికి రెట్టింపు ఇస్తామని మోసం
- నల్లగొండ జిల్లాలో వెయ్యి మందికిపైగా బాధితులు
- ఒక్కొక్కరు రూ.30 వేల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడి
- జిల్లా వ్యాప్తంగా రూ.30 కోట్లు నష్టపోయినట్లు సమాచారం
- నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్‌లో ఫిర్యాదులు



నీలగిరి, ఆగస్టు 5 : పైసాకు పైసా.. రెట్టింపుతోపాటు అధికశాతం వడ్డీ.. ఆకర్షణీయమైన ఆఫర్లు.. ఇంట్లోనే ఉంటూ కోట్ల రూపాయలు సంపాదించండి అంటూ ముందుకు వచ్చిన ఓ యాప్ జిల్లా ప్రజల నెత్తిన కుచ్చుటోపీ పెట్టింది. కొద్దికొద్దిగా డబ్బులు చెల్లించి లాభాలు పొందండి అంటూ అమాయక ప్రజలను డాయ్(డాటా మీర్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ స్టీరింగ్) యాప్ దగా చేసింది. నల్లగొండ పట్టణంలో సుమారు 370 మంది, జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది బాధితులు దీని ద్వారా నష్టపోయినట్లు తెలుస్తున్నది. ఒక్కొక్కరు ఈ యాప్‌లో రూ.30వేల నుంచి రూ .10లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. సుమారు రూ.30 కోట్లకుపైగా పెట్టుబడుల పేరుతో యాప్ జనాలను ఆకర్షించి డబ్బులు వచ్చాక మూసివేసింది. బాధితులు చేసేది లేక లబోదిబో మంటూ పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులతో రూ.5లక్షల వరకు సీజ్ చేసినట్లు పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

డాయ్‌లో ప్రవేశం ఇలా...

ముందుగా మన వద్ద ఉన్న డబ్బులతో యాప్‌లో పెట్టుబడి పేరుతో రీచార్జి చేసుకోవాలి. అలా చెల్లించిన డబ్బులు థర్డ్ పార్టీ అమౌంట్‌కు జమ అవుతాయి. అక్కడ నుంచి యాప్‌లో సదరు వ్యక్తికి షేర్‌ల రూపంలో మనీ వస్తుంది. యాప్‌లో వివిధ రకాల షేర్‌లు ఉంటాయి. ఒక్కో షేర్ విలువ రూ. 300 నుంచి 10వేల వరకు ఉంటుంది. పెద్ద షేర్స్ తీసుకుంటే ఎక్కువ మొత్తంలో, తక్కువ షేర్స్ తీసుకుంటే తక్కువ లాభాలు వస్తాయి. నష్టం అనే పదం ఉండదు. అందులో చేరాలంటే ప్రతి సభ్యుడు కచ్చితంగా పది షేర్స్ తగ్గకుండా తీసుకోవాలి. అప్పుడే అతనికి లాభం వస్తుంది. తక్కువగా షేర్స్ ఉన్న వారికి రోజు రోజు డ్రా చేసుకునేందుకు వీలు కల్పించారు. కానీ ఎక్కువ షేర్ తీసుకున్న వారికి ప్రత్యేకంగా ఒక పరిధిని ఏర్పాటు చేశారు. ఇలా చిన్నచిన్న వారిని ఆకర్షించి డబ్బులు చెల్లిస్తూ వారిని ఇతరులను చేర్పిస్తే లాభాలు వస్తాయని, షేర్స్ పెరుగుతాయని నమ్మించి ఇతరులతో కూడా పెట్టుబడి పెట్టిస్తారు. వాట్సాప్ ద్వారా కూడా సభ్యులకు ఎప్పటికప్పుడు వివరాలు అందిస్తారు. ఇలా నడుస్తున్న నేపథ్యంలో గత పది రోజుల కితం 7.2 మిలియన్స్ ప్రైజ్‌మనీ గెలిచారని చెప్పి ప్రత్యేకమైన ఆఫర్లతో కూడిన ప్లాన్‌లను రూపొందించారు. రెండు రోజుల్లో పెట్టిన పెట్టుబడి రెండింతలు, అధిక వడ్డీ అంటూ పెట్టారు. దాంతో చిన్నచిన్న వ్యాపారులు, కూలీలు, కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా వారికి తగ్గట్టుగా రూ.లక్ష నుంచి రూ. 10లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఉదాహరణకు యాప్‌లో రూ.50వేలు పెట్టుబడి పెడితే 150 రోజులపాటు ప్రతిరోజూ రూ.850 (రూ.1.27లక్షలు)తోపాటు అదనంగా మరో రూ.50 వేలు వస్తాయి. రూ.300 పెట్టి ఒక షేర్‌ను కొనుగోలు చేస్తే రెండు రోజులపాటు రోజుకు రూ.30 వడ్డీ అదనంగా రూ.660 వస్తాయి.

ప్రభుత్వ ఉద్యోగులే ఎక్కువగా..

డాయ్ యాప్ నిర్వాహకుడు 7.2 మిలియన్ డాలర్లు ప్రైజ్‌మనీ గెలిచానని, అందులోని తన లాభాలు తీసుకుని మిగిలిన వాటిని డాయ్‌లోని సభ్యులకు అందిస్తానని ప్రకటన చేశాడు. అందులో భాగంగా జూలై 26న ప్రత్యేకమైన ఆఫర్లు పెట్టడంతో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున సభ్యులుగా చేరినట్లు సమాచారం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 370 మంది వరకు పెట్టుబడి పెట్టినట్లు వినికిడి. రెండు రోజుల్లో పెట్టిన పెట్టుబడికి రెట్టింపుతోపాటు అధిక శాతం వడ్డీ కూడా ఇస్తానని యాప్ నిర్వాహకులు ప్లాన్‌లు రూపొందించడంతో ఒక్కొక్కరు రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు పెట్టబడి పెట్టారు. జూలై 28న చెల్లించాల్సి ఉండగా అదివారం కావడంతో ఇబ్బంది ఉందని, సోమవారం 29కి వాయిదా వేశారు. డాయ్ యాప్ ప్లాన్‌ల ప్రకారం సభ్యుల షేర్స్ డబ్బులు వచ్చి వారి ఐడీలో జమ చేసినట్లుగా చూపించారు. కానీ వాటిని డ్రా చేసేందుకు వీలు లేకుండా చేశారు. మరుసటి రోజు యాప్‌లో తమ ఐడీలోని బ్యాలెన్స్ కూడా కనబడకుండా చేశారు. దాంతో చేసేది లేక బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నల్లగొండ టూటౌన్ పరిధిలో కేసు నమోదు చేసి బాధితులు ఇచ్చిన వివరాలతో విచారణ చేపట్టారు. కేవలం రూ.5లక్షల వరకు సీజ్ చేసినట్లు సభ్యులు చెబుతున్నారు. కానీ పోలీసులు ధ్రువీకరించడం లేదు.

పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తాం

డాయ్ యాప్ గురించి ఇప్పటికే 7, 8 అకౌంట్లను సీజ్ చేశాం. అందులో కొంత నగదును కూడా సీజ్ చేశాం. యాప్‌కు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ చేయాలని సైబర్ క్రైమ్‌తోపాటు పోలీస్ సిబ్బందికి కూడా ఆదేశాలు ఇచ్చాం. మాకు ఫిర్యాదు చేసిన వారే కాకుండా పెట్టుబడి పెట్టిన ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తున్నాం. బాధితులను త్వరలో గుర్తించి తగిన చర్యలు తీసుకుంటాం.

– శరత్ చంద్ర పవార్, నల్లగొండ ఎస్పీ

నల్లగొండ : హైదరాబాద్ రోడ్డులోని కనకదుర్గ వైన్స్‌లో జూలై 6న మద్యం శాంపిళ్లను సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి

కాస్ట్లీ విస్కీలో చీప్ లిక్కర్!

- నల్లగొండలో నకిలీ మద్యం అమ్మకాలు
- విస్కీ బాటిల్‌లో 42శాతం ఆల్కహాల్‌కుగానూ 70శాతం గుర్తింపు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలు
- జిల్లా కేంద్రంలో కనకదుర్గ, ప్రజా వైన్స్‌లపై కేసు నమోదు

నల్లగొండ, ఆగస్టు 5 : జిల్లా కేంద్రంలో నకిలీ మద్యం అమ్మకాలు బాహాటంగా జరుగుతున్నాయా ? కాస్ట్లీ విస్కీలో చీప్ లిక్కర్ కలిపి అమ్ముతున్నారా ? అంటే నిజమే అనేది ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలో తేలిపోయింది. నల్లగొండ పట్టణంలోని రెండు వైన్స్ షాపుల్లో ఇటీవల రైడ్ చేసి తీసిన శాంపిల్స్‌లో నాణ్యత లేదని బయటపడింది. ఆల్కహాల్ శాతం 42 శాతానికిగానూ 70శాతం ఉన్నది. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న కనకదుర్గ వైన్స్, ప్రజా వైన్స్‌లో ఈ కల్తీ మద్యం దందా నడుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి స్వాతి రెండు వైన్స్‌ల యాజమాన్యానికి నోటీసులు అందజేసి కేసు ఫైల్ చేశారు. వారికి చాలెంజ్ కింద నెల సమయం ఇచ్చిన తర్వాత చార్జిషీట్ వేస్తామని స్వాతి నమస్తే తెలంగాణకు తెలిపారు.

ఎక్కువ ధర విస్కీలో చీప్ లిక్కర్ కలిపి..

జిల్లాలో విస్కీ రూ.560 నుంచి రూ.1,600 వందల వరకు అందుబాటులో ఉన్న బ్రాండ్లు వైన్స్‌ల్లో అమ్ముతున్నారు. చీప్ లిక్కర్ ఫుల్ బాటిల్ రూ.560 ఉండగా రాక్ ఫోర్డ్ విస్కీ ఫుల్ బాటిల్‌కు రూ.1600 వరకు ఉంటుంది. విస్కీల్లో అధిక ధర విస్కీ అయిన రాక్ ఫోర్డ్, బ్లెండర్స్ ప్రైడ్, సిగ్నేచర్ లాంటి మద్యం బాటిళ్లలో ఓసీ, ఐబీ లాంటి మద్యం కలిపి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా వాటిల్లో 42 శాతం ఆల్కహాల్ శాతం ఉంటుంది. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అదికారులు బ్లెండర్స్‌ప్రైడ్, ఐకాన్ అనే విస్కీ బాటిళ్లను శాంపిల్స్‌కు పంపగా వాటిల్లో ఆల్కహాల్ శాతం 70 ఉన్నట్లు గుర్తించారు. స్పెషల్ రైడ్‌లో భాగంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు రెండు వైన్ షాపుల్లో తనిఖీలు చేసి శాంపిల్స్ తీసుకెళ్లగా ఆ రెండింట్లోనూ కల్తీ మద్యం ఉన్నట్లు తేల్చారు. ఈ లెక్కన జిల్లా కేంద్రంతో పాటు పలుచోట్ల కల్తీ మద్యం జోరుగా విక్రయిస్తున్నట్లు స్పష్టమవుతున్నది.

వైన్స్ పర్మిట్ రూముల్లో ఇష్టారాజ్యంగా ఫుడ్

జిల్లాలో 174 వైన్స్ షాపులు ఉండగా వాటిల్లో యాజమాన్యాలు పర్మిట్ రూములకు అనుమతి తీసుకున్నప్పటికీ ఫుడ్ విక్రయించే నిర్వాహకులు మాత్రం అనుమతి తీసుకోకపోవటంతో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి అందరికీ నోటీసులు జారీ చేశారు. ఆయా సిట్టింగ్ పర్మిట్ రూముల్లో ప్లేట్ పల్లీకి రూ.100, చికెన్‌కు రూ.150, తలకాయ, బోటి, మటన్‌కు రూ.200, చేపకు రూ.100 చొప్పున ఇష్టారాజ్యంగా ధరలు పెట్టి, మద్యం ప్రియులకు నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వడం లేదని తెలుస్తున్నది. వైన్స్ సిట్టింగ్‌లలో ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని లేదంటే రూ.5లక్షల ఫైన్ విధిస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి హెచ్చరించారు.

సరిహద్దు చెక్ పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలు

కోదాడ : రామాపురం చెక్‌పోస్టు వద్ద నాకాబందీని పరిశీలిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్, ఆగస్టు 5 : అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ చెక్‌పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నది. ఈ నెల 3వ తేదీ రాత్రి నుంచి 4వ తేదీ తెల్లవారుజాము వరకు కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 65పై రామాపురం చెక్ పోస్టు వద్ద, అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధి శాంతినగఘర్ చెక్‌పోస్టు వద్ద, మోతె పోలీస్‌స్టేషన్ పరిధి మామిళ్లగూడెం చెక్‌పోస్టు వద్ద, నూతనకల్ పోలీస్ స్టేషన్ పరిధి బిక్కుమల్ల చెక్‌పోస్టు వద్ద మొత్తం 2124 వాహనాలు తనిఖీ చేశారు. అక్రంగా తరలిస్తున్న 252 గోవులను, పొగాకు ఉత్పత్తులను, 48 వాహనాలను పట్టుకున్నారు. 30 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. రామాపురం చెక్‌పోస్టును ఎస్పీ పరిశీలించారు. అక్రమ రవాణా, అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు

ఉద్యోగాలు సాధించిన కొడుకు, కూతురికి స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

బొడ్రాయిబజార్, ఆగస్టు 5 : అన్నా చెల్లెలికి ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేటకు సమ్మెల విజయ్‌కుమార్, రేణుకాఎల్లమ్మ దంపతులకు కుమారుడు రాహుల్‌గౌడ్, కుమార్తె ఐశ్వర్య ఉన్నారు. తండ్రి వ్యవసాయంతో పాటు పాన్‌షాప్ నడుపుతూ పిల్లలను చదివించాడు. ఇటీవల నిర్వహించిన టీజీపీఎస్‌సీ ఫలితాల్లో కుమారుడు రాహుల్‌గౌడ్ 450 మార్కులకు 345 సాధించి పంచాయతీరాజ్‌లో ఏఈఈగా, కుమార్తె ఐశ్వర్య 337 మార్కులతో పబ్లిక్ హెల్త్‌లో ఏఈఈ ఉద్యోగం సాధించారు. తమ ఇద్దరు పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు సంబురపడుతున్నారు.

9 వరకు నేతన్న బీమా పథకానికి దరఖాస్తులు

- జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కామిల్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 5 : నేతన్న బీమా పథకానికి అర్హులైన వారు దరఖా